# ప్రజా మారుతి
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 194 పేజిలు : 04 వెల రూ. 2 మంగళవారం 20 - 01 - 2026




పాట్నాలోని ఆసుపత్రిలో సిగరెట్ తాగిన ఎమ్మెల్యే

## కవిత కొత్త పార్టీ... రంగంలోకి ప్రశాంత్ కిశోర్!




- కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కవిత అడుగులు
- వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో వరుస సమావేశాలు
- తెలంగాణ జాగృతిని రాజకీయ శక్తిగా మారుస్తానని ప్రకటన
- మైనార్టీలు, బీసీలు, యువతకు తన పార్టీలో చేరాలని ఆహ్వానం

## దావోస్‌కు రేవంత్ రెడ్డి

- దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొననున్న రేవంత్
- పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా దావోస్ పర్యటన
- వనదేవతల దర్శనం పూర్తి చేసుకుని స్విట్జర్లాండ్ పయనం
- ఐదు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో రేవంత్ రెడ్డి అంతర్జాతీయ స్థాయి సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో సమావేశం



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు బయలుదేరారు. ఈ ఉదయం మేడారం వనదేవతల దర్శనం పూర్తి చేసుకున్న రేవంత్ రెడ్డి... అక్కడి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు.ఐదు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో రేవంత్ రెడ్డి అంతర్జాతీయ స్థాయి సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను వివరించనున్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. తెలంగాణలో మౌలిక వసతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వ్యాపారానికి అనుకూల - మిగతా 2 లో

## 2,500 మందితో 'వందేమాతరం' ప్రదర్శన

- కీరవాణిని అభినందించిన బండి సంజయ్
- వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా రిపబ్లిక్ డే పరేడ్ ప్రత్యేక ప్రదర్శన
- సంగీతం అందిస్తున్న ఎం.ఎం. కీరవాణి
- దేశవ్యాప్తంగా 2500 మంది కళాకారులతో భారీ కార్యక్రమం
- కీరవాణి కృషిని కొనియాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహణ




హైదరాబాద్ : ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం కీరవాణి స్వరాలు సమకూర్చడం ఒక చరిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2,500 మంది కళాకారులతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తుండడం నిజంగా అద్భుతమని బండి సంజయ్ కొనియాడారు. సంగీతం, జాతీయ స్ఫూర్తి, ప్రతిష్ఠ అన్నీ కలగలిసిన ఈ కార్యక్రమం దేశానికి ఒక చారిత్రక నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు. - మిగతా 2 లో

## బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక



- నేడు ఉదయం పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నబీన్
- జేపీ నడ్డా పదవీ కాలం ముగియడంతో అనివార్యమైన ఎన్నిక
- గత ఏడాది డిసెంబర్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితిన్ నబీన్ ప్రస్తుతం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది.నితిన్ నబీన్ (46) బీహార్ రాష్ట్రానికి చెందినవారు. ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గత ఏడాది డిసెంబర్‌లో బీజేపీ ప్రకటించింది. ఆయనను పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వెలువడ్డాయి. నబీన్‌కు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నబిన్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## మహిళతో కర్ణాటక డీసీఆర్ఈ డీజీపీ రాసలీలలు

- తీవ్ర వివాదంలో కర్ణాటక డీసీఆర్ఈ డీజీపీ రామచంద్రరావు
- డీజీపీ స్థాయి అధికారి రామచంద్రరావు రాసలీలల వీడియోలు వైరల్
- ఆఫీసులోనే మహిళతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు
- అవి మార్ఫింగ్ వీడియోలని ఖండించిన డీజీపీ
- ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశించిన సీఎం సిద్దరామయ్య
- గతంలో గోల్డ్ స్మగ్లింగ్ కేసులోనూ డీజీపీపై ఆరోపణలు



కర్ణాటక : కర్ణాటకలో డీజీపీ స్థాయి అధికారి కె.రామచంద్రరావు తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఓ మహిళతో రాసలీలల వీడియోలు పెను దుమారం రేపుతున్నాయి. తన కార్యాలయంలోనే ఓ మహిళతో అభ్యంతరకర రీతిలో ప్రవర్తించినట్లు ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను రామచంద్రరావు ఖండించారు. అవన్నీ మార్ఫింగ్ చేసిన వీడియోలని స్పష్టం చేశారు.గతంలో గోల్డ్ స్మగ్లింగ్ కేసులోనూ రామచంద్రరావుపై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో అరెస్టయిన నటి రన్యా రావుకు ఈయన సవతి తండ్రి. ఈ కేసు నేపథ్యంలో 2025 మార్చిలో ప్రభుత్వం ఆయన్ను నిర్బంధ సెలవుపై పంపించి, ఇటీవలే తిరిగి విధుల్లోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డీజీపీగా పనిచేస్తున్నారు. కాగా, ఈ వీడియోల వ్యవహారంపై న్యాయవాదిని సంప్రదించి తదుపరి చర్యలు - మిగతా 2 లో




## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- మరణించిన ఆరుగురు మావోయిస్టుల గుర్తింపు
- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్
- ఈ నెల 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు కాల్పులు
- మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు




## దావోస్ వేదికగా పెట్టుబడుల వేట

- పక్కా ప్రణాళికతో సీఎం చంద్రబాబు బృందం
- దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొననున్న సీఎం చంద్రబాబు
- పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వ బృందం పర్యటన
- గ్రీన్ ఎనర్జీ, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ రంగాలపై ప్రధానంగా దృష్టి
- వివిధ దేశాల పారిశ్రామికవేత్తలు, తెలుగు డయాస్పోరాతో సమావేశాలు
- మంత్రులు లోకేశ్, టీజీ భరత్ తో కలిసి పర్యటిస్తున్న సీఎం




అమరావతి : ఏపీకి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు స్విట్జర్లాండ్ పర్యటనకు బయల్దేరారు. కాసేపట్లో జూరిచ్ చేరుకోనున్న ఆయన, అక్కడి నుంచి దావోస్ వెళ్లి నాలుగు రోజుల పాటు జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొంటారు. సీఎం వెంట మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా పలువురు ఉన్నతాధికారులు ఈ పర్యటనలో ఉన్నారు.ఈ ఏడాది డబ్ల్యూఈఎఫ్ సదస్సుకు రికార్డు స్థాయిలో సుమారు 130 దేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధులు, 60 దేశాల ప్రభుత్వ అధినేతలు హాజరవుతారని అంచనా. - మిగతా 2 లో

## స్విట్జర్లాండ్‌లో భారత రాయబారితో సీఎం చంద్రబాబు బృందం భేటీ



- స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో సీఎం చంద్రబాబు బృందం భేటీ
- ఏపీకి స్విస్ పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా చర్చ
- టెక్నాలజీ, ఫార్మా రంగాల్లో భాగస్వామ్యానికి ఆహ్వానం
- విద్యా సంస్థల మధ్య సహకారంపైనా కీలక చర్చలు
- ఇండియా–EFTA ఒప్పందంతో ఏపీకి ప్రయోజనమని లోకేశ్ ధీమా

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం చంద్రబాబు బృందం స్విట్జర్లాండ్ కు తరలివెళ్లింది. ఈ క్రమంలో వారు స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో జ్యూరిచ్‌లో సమావేశమయ్యారు. దీనిపై లోకేశ్ ట్వీట్ చేశారు. ఏపీ–స్విట్జర్లాండ్ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం - మిగతా 2 లో

# సంపాదకీయం

## ముంబై.. బీజేపీ ముల్లె

దేశ ఆర్థికరాజధాని ముంబైని బీజేపీ చేజిక్కించుకుంది. రాజకీయ అవసరాలు, ప్రయోజనాలు సహా వివిధ కారణాలతో దాదాపు పదేళ్ళుగా వాయిదాపడుతూ వచ్చిన బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల్లో బీజేపీశివసేన కూటమి మంచి విజయం సాధించి, ఠాక్రేల చేతుల్లో మూడుదశాబ్దాలుగా ఉన్న మహానగరాన్ని స్వాధీనం చేసుకుంది. డెబ్బైఐదువేల కోట్ల బడ్జెట్‌తో ఆసియాలో అతిఖరీదైన మునిసిపాలిటీకి తొలిసారి బీజేపీ మేయర్ రాబోతున్నారు. వివిధ సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్ బీజేపీ కూటమి ఘన విజయాన్ని, ఠాక్రేల ఘోరపరాజయాన్ని అంచనాకట్టినప్పటికీ, ఫలితాలు అంత తీవ్రంగా లేకపోవడం గమనించాలి.మహాయుతిది మహాద్భుత విజయమూ కాదు, ఠాక్రేలది ఘోర పరాజయమూ కాదు అంటున్నవారూ లేకపోలేదు. అయినప్పటికీ, ఠాక్రే సోదరుల కలయికతో అద్భుతాలు జరిగిపోతాయని నమ్మినవారికి మాత్రం ఈ ఫలితాలు జీర్ణించుకోలేనివి. సోదరులు ఒక్కటైతే ఇక తిరుగుండదని ఇరవయ్యేళ్ళుగా అదేపనిగా వాదిస్తున్న వారు, నిజం కాబోలని అనుకున్నవారు ఇప్పుడు షాక్‌లో ఉన్నారు. కేవలం ఈ ఎన్నికల ముందు, శివసేన పుట్టినిల్లయిన ఖరీదైన ముంబైని బీజేపీ ఎత్తుకుపోకుండా ఆపడం కోసం ఉద్ధవ్, రాజ్ ఠాక్రేలు ఈ మధ్యనే చేయీచేయీ కలిపారు, జనం నమ్మరేమోనన్న అనుమానంతో ఈనాటి ఈ బంధం ఏనాటికీ తెగిపోదని కూడా హామీ ఇచ్చారు. ఉద్ధవ్ పార్టీ ప్రతినిధులు దీనిని మనసుల కలయికగా అభివర్ణించారు. మరాఠీ అస్మితను జనంలో రేపి, మరాఠీ ఓటుబ్యాంకును సుస్థిరం చేసుకొని, హిందీ పెత్తనానికి ప్రతినిధిగా ఉన్న 'మహాయుతి' కూటమిని తరమికొట్టడానికి ఈ సోదరుల ఏకీకరణ ఉపకరిస్తుందని నమ్మారు. 2017నాటి ఫలితాలతో, తదనంతర చీలికల నేపథ్యంలో సాధించిన ఇప్పటి ఫలితాలను పోల్చలేము కానీ, ఉద్ధవ్ మీద ముంబైవాసుల్లోనూ అంత ప్రేమాభిమానాలు పొంగిపొర్లలేదని అర్థం. ఆయనతో చేయికలిపిన సోదరుడికి ఓ మూడుస్థానాలు పెరగడం వినా పెద్ద ప్రయోజనం లేకపోయింది. గుజరాతీలు, తమిళులమీద ఠాక్రే సోదరులు చేసిన ఘాటైన విమర్శలు భూమిపుత్రుల ఓట్లు పెద్దగా సాధించిపెట్టలేక పోయాయి కానీ, మహారాష్ట్రేతరుల ఓట్లు నిర్దిష్టంగా పడి బీజేపీకి అధిక ప్రయోజనం కలిగింది. 'హఠావో లుంగీ, బజావో పుంగీ' వంటి నినాదాలు మరాఠీ అస్మితను ఎంత రేపిందో తెలియదు కానీ, హిందూత్వదే పైచేయి అయింది. ఇక, పవార్ కుటుంబం కూడా ఇటువంటి విన్యాసాన్నే చేసి విఫలమైంది. పై స్థాయిలో చీలిన పవార్లు స్థానిక ప్రయోజనాలకోసం చేయికలపగానే జనం ఆమోదించలేదు. ముంబైసహా అత్యధిక మునిసిపాలిటీలను బీజేపీ గెలుచుకోవడం ఫడ్నవీస్‌కు మంచి శక్తినిస్తుంది. బీజేపీ పక్షాన ప్రచారంలో నరేంద్రమోదీ, అమిత్‌షా వంటి ఉద్దండులు లేకుండా పార్టీని విజయతీరాలకు చేర్చి రాష్ట్రంలో ఆయన తిరుగులేని నాయకుడుగా అవతరించాడు. మరో పరీక్ష నెగ్గిన ఏక్‌నాథ్ షిండే సైతం కూటమిలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడంతోపాటు, అసలు సిసలు శివసేన తానేనని సామాన్యజనంతోనూ అనిపించుకున్నారు. లోక్‌సభ, శాసనసభకు మాత్రమే కాక, మహాయుతి బలం స్థానిక సంస్థలకూ, మరోపక్క యావత్ రాష్ట్రానికీ విస్తరించిందని ఈ ఎన్నికలు రుజువుచేశాయి.ముంబైని కాపాడుకోకపోయినా, తిరిగికోలుకోగలమన్న నమ్మకాన్ని ఈ ఫలితాలు ఠాక్రేలకు ఇచ్చాయి. ఉద్ధవ్ పార్టీ బీజేపీ తరువాత స్థానంలో ఉండటమే కాక, షిండేసేనతో పోల్చితే ఎంతో మెరుగ్గా కనిపిస్తోంది. సోదరుడితో చేయికలపడంకోసం మహావికాస్ అగాఢీకి దూరమైనందువల్ల ఉద్ధవ్ సెక్యులర్ ఓట్లు కోల్పోయారనీ, కాంగ్రెస్ బాగా బలహీనపడినస్థితిలో ఓట్లు బదిలీ అయివుండేవని అంటారు. అయితే, బాల్‌ఠాక్రేమీద స్థానికుల్లో ఉన్న ప్రేమాభిమానాలు పూర్తిగా చెరిగిపోలేదని ఉద్ధవ్‌కు వచ్చిన స్థానాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ముంబైని గెలవడం కంటే పార్టీని రక్షించుకోవడం ఠాక్రేలకు ఇప్పుడు మరీ ప్రధానం. ప్రస్తుతానికి అధికసీట్లు దక్కకపోయినా, రేపోమాపో గాలి తన వైపు తిరగవచ్చునని ఆశ మిగిలింది. ఠాక్రే బ్రాండ్‌నూ, బాలాసాహెబ్ వారసత్వాన్ని కాపాడుకోవడమే కష్టమైపోతున్న తరుణంలో, పార్టీ, గుర్తులతో సహా సమస్తమూ కోల్పోతూ, ఓటర్లకు దూరమైపోతున్న ఉద్ధవ్‌కు ఈ ఎన్నికలు కొత్త ఆశనీ, ఆశ్వాసననూ ఇచ్చాయి.

## దావోస్ వేదికగా పెట్టుబడుల వేట

**మొదటిపేజీ తరువాయి** – భారతదేశం నుంచి ఏడుగురు ముఖ్యమంత్రులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించేందుకు ఏపీ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో సిద్ధమైంది. ఇందుకోసం ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు కూడా రూపొందించింది.ప్రధానంగా గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమోనియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్నాలజీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వీటితో పాటు టూరిజం, హాస్పిటాలిటీ, విద్య, వైద్య రంగాల్లోనూ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రణాళికలు రచించింది. రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, నూతన పాలసీలను ప్రపంచ స్థాయి కంపెనీలకు సీఎం బృందం వివరించనుంది.ముఖ్యంగా అమరావతిలో 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటు, లక్ష మంది క్వాంటం నిపుణులను తయారు చేసేందుకు చేపట్టిన 'అడ్వాన్స్‌డ్ క్వాంటం స్కిల్లింగ్' కోర్సు గురించి సదస్సులో ప్రముఖంగా ప్రస్తావించనున్నారు. ఇప్పటికే ఈ కోర్సులో 50 వేల మంది నమోదు చేసుకున్న విషయాన్ని పారిశ్రామికవేత్తల దృష్టికి తీసుకెళ్లనున్నారు. అలాగే, కాకినాడలో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ అమోనియా-గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్లాంట్ ప్రాజెక్టును కూడా ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారు.గతేడాది (2025) జరిగిన డబ్ల్యూఈఎఫ్ సదస్సులో జరిపిన చర్చల ద్వారా ఏపీ సుమారు రూ.2.36 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగింది. ఈసారి అంతకుమించిన పెట్టుబడులను రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పర్యటన తొలి రోజే సీఎం చంద్రబాబు ఏడు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా 20 దేశాల నుంచి హాజరయ్యే తెలుగు ప్రజలతో 'తెలుగు డయాస్పోరా' వేదికగా సమావేశం కానున్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి** – చేయడం, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు స్విస్ కంపెనీలను ప్రోత్సహించడంపై ఈ భేటీలో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు లోకేశ్ తెలిపారు.టెక్నాలజీ, మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, రైల్వే, ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ వంటి కీలక రంగాల్లో స్విస్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను ఈ సందర్భంగా లోకేశ్ వివరించారు. పారిశ్రామిక రంగంతో పాటు విద్యా రంగంలోనూ సహకారంపై చర్చించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఫార్మా, వైద్య పరికరాలు, స్టార్టప్‌ల రంగాల్లో స్విట్జర్లాండ్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో ఏపీలోని విద్యా సంస్థల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించారు. దీని ద్వారా ఏపీకి చెందిన నిపుణులు, విద్యార్థులు, తెలుగు ప్రవాసులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఇటీవలే కుదిరిన ఇండియా-ఇఫ్టా (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, ఉద్యోగాలు, ఆవిష్కరణల పరంగా ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తుందని మంత్రి లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం ఏపీకి స్విస్ పెట్టుబడులు రావడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ద

## అక్రమాలకు పాల్పడిన వారెవరికైనా శిక్ష తప్పదు




**మొదటిపేజీ తరువాయి** – ఏపీ రాజకీయాల్లో త్వరలోనే సంచలన పరిణామాలు చోటుచేసుకోనున్నాయని రాష్ట్ర బీజేపీ చీఫ్ మాధవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కేవలం లిక్కర్ అవినీతికి మాత్రమే పరిమితం కాకుండా అనేక అక్రమాలు, అరాచకాలకు పాల్పడిందని విమర్శించారు. అక్రమాలకు పాల్పడిన వారెవరికైనా తప్పకుండా శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకోబోతోందని వెల్లడించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా చేసిన ట్వీట్ పై స్పందిస్తూ ఆయన ఈ మేరకు స్పందించారు.అనంతరం పార్టీ విషయాలపై మాట్లాడుతూ, బీజేపీలో మూడేళ్లకు ఒకసారి జాతీయ అధ్యక్షుడు మారే సంప్రదాయం ఉందని చెప్పారు. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీ బీజేపీ అని, దేశవ్యాప్తంగా పార్టీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. బీజేపీ జాతీయ నూతన అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో తాము ఢిల్లీకి వచ్చామని వివరించారు.

## దావోస్‌కు బయల్దేరిన రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి** – వాతావరణాన్ని గ్లోబల్ ఇన్వెస్టర్లకు వివరించనున్నారు.ఈ పర్యటనలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు కూడా పాల్గొననున్నారు. మేడారం అమ్మవార్ల ఆశీస్సులతో ప్రారంభమైన ఈ విదేశీ పర్యటన తెలంగాణకు కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకువస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

## మహిళతో కర్ణాటక డీసీఆర్ఈ డీజీపీ రాసలీలలు



**మొదటిపేజీ తరువాయి** – తీసుకుంటానని రామచంద్రరావు మీడియాకు తెలిపారు.సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వీడియోల్లో డీసీఆర్ఈ డీజీపీ రామచంద్రరావు యూనిఫాంలో ఉండగానే తన అధికారిక ఛాంబర్‌లో ఓ మహిళతో సన్నిహితంగా, అశ్లీల ప్రవర్తనతో కూడిన దృశ్యాలు ఉన్నాయి. ఒక క్లిప్‌లో ఆయన మహిళను ముద్దుపెట్టుకుం టుండగా, మరో వీడియోలో సూట్‌లో ఉండగా భారత జాతీయ పతాకం, పోలీసు శాఖ చిహ్నం ముందు ఇలాంటి ప్రవర్తనే కనబరిచారు. ఈ వీడియోల్లో మహిళ ముఖాన్ని బ్లర్ చేసి, నేపథ్య సంగీతం జోడించి సర్క్యులేట్ చేశారు.ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు రామచంద్రరావు సోమవారం హోంమంత్రి జి. పరమేశ్వర కార్యాలయానికి వెళ్లారు. అయితే, ఆయనతో భేటీకి మంత్రి నిరాకరించినట్లు సమాచారం. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని హోం శాఖను ఆదేశించారని తెలిసింది.ఈ వీడియోలను ఏడాది క్రితమే చిత్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, వీటిని ఇప్పుడు ఎందుకు విడుదల చేశారనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై మాజీ హోంమంత్రి ఆరగ జ్ఞానేంద్ర స్పందిస్తూ.. సీనియర్ అధికారి ఈ స్థాయికి దిగజారడం సిగ్గుచేటని, ఆయన పోలీసు శాఖను అవమానించారని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**మొదటిపేజీ తరువాయి** – ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉత్తర-పశ్చిమ ప్రాంతంలో భద్రతా బలగాలు మరో కీలక విజయాన్ని సాధించాయి. భోపాలపట్నం-ఫర్సేగఢ్ సరిహద్దుల్లోని అటవీ, కొండ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ ఇంచార్జ్ డీవీసీఎం దిలీప్ బెండ్జా సహా మొత్తం ఆరు మంది మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.మావోయిస్టుల కదలికలపై అందిన నమ్మకమైన సమాచారంతో డీఆర్‌జీ బీజాపూర్, డీఆర్‌జీ దంతేవాడ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు (202, 206, 210 బెటాలియన్లు), సీఆర్‌పీఎఫ్ 214 బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందాలు ఈనెల 17న ప్రత్యేక సర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్‌లో జనవరి 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు మధ్య తీవ్ర కాల్పులు చోటుచేసుకున్నాయి.మృతులను దిలీప్ బెంజా (రివార్డు రూ.8 లక్షలు), మాధవి కోసా (రూ.5 లక్షలు), పాలో పోడియం (రూ.5 లక్షలు), లఖీ మద్కం (రూ.5 లక్షలు), జుగ్లో బంజం (రూ.2 లక్షలు), రాధా మెట్ట (రూ.2 లక్షలు)గా గుర్తించారు. వీరిపై మొత్తం రూ.27 లక్షల రివార్డు ఉందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం తెలిపారు. కీలక నేత దిలీప్ బెంజాపై బీజాపూర్ జిల్లాలో 135 క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.ఘటనాస్థలంలో నుంచి రెండు ఏకే-47లు, ఒక ఇన్సాస్, రెండు 0.303 రైఫిళ్లు, ఒక కార్బైన్‌తో పాటు పేలుడు పదార్థాలు, వైర్‌లెస్ సెట్లు, మావోయిస్టు సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు.



దిలీప్ బెండ్జాపై 135కు పైగా కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

## 2,500 మందితో 'వందేమాతరం' ప్రదర్శన

**మొదటిపేజీ తరువాయి** – ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో భాగంగా, కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రదర్శన జరగనుంది. భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చిన 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 2,500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొననుండగా, దీనికి కీరవాణి సంగీతాన్ని సమకూర్చారు.ఈ అరుదైన అవకాశంపై కీరవాణి కూడా స్పందించారు. "వందేమాతరం! చరిత్రాత్మక గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా, జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు సంగీతం సమకూర్చే గౌరవం నాకు దక్కింది. ఇది నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. దేశ స్ఫూర్తిని చాటే ఈ కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలి" అని ఆయన తన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ అపురూప ఘట్టం కోసం దేశవ్యాప్తంగా సంగీత ప్రియులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## కవిత కొత్త పార్టీ... రంగంలోకి ప్రశాంత్ కిశోర్!

**మొదటిపేజీ తరువాయి** – బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక, తన రాజకీయ భవిష్యత్తుపై కల్వకుంట్ల కవిత పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రయత్నాలను ఆమె ముమ్మరం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, కార్యాచరణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) ఆమెకు సహాయం అందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది.గత రెండు నెలల వ్యవధిలో ప్రశాంత్ కిశోర్ రెండుసార్లు హైదరాబాద్ వచ్చి కవితతో రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా కూడా వీరి మధ్య భేటీ జరిగినట్లు తెలుస్తోంది. కొత్త పార్టీని ప్రకటిస్తే రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయి, పార్టీని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, అనుసరించాల్సిన వ్యూహాలు వంటి కీలక అంశాలపై వీరిద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చలు



జరిగినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ సమావేశాలపై కవిత గానీ, తెలంగాణ జాగృతి ప్రతినిధులు గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.మరోవైపు తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకే కొత్త పార్టీ అవసరమని కవిత బలంగా వాదిస్తున్నారు. తన సారథ్యంలోని 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చి, 2029 ఎన్నికల్లో ప్రజల పక్షాన పోటీ చేస్తామని ఆమె ఇప్పటికే స్పష్టం చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పార్టీ విధివిధానాల రూపకల్పనకు దాదాపు 50 కమిటీలతో అధ్యయనం చేయిస్తున్నారు. అదే సమయంలో మైనార్టీలు, బీసీలు, యువత తనతో కలిసి రావాలని, తన 'తెలంగాణ సెక్యులర్ పార్టీ'కి మద్దతివ్వాలని పిలుపునిస్తున్నారు.గతంలో ఏపీలో వైఎస్ జగన్‌కు, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్‌కు, వ్యూహకర్తగా పనిచేశారు. తమిళనాడులో నటుడు విజయ్ పార్టీకి కూడా సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు కవితతో జతకట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు కవిత క్షేత్రస్థాయి సన్నాహాలు, మరోవైపు పీకే వ్యూహాత్మక మార్గదర్శకత్వంతో త్వరలోనే కొత్త పార్టీ ప్రకటన ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ కొత్త రాజకీయ ప్రయోగం తెలంగాణలో ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

## నిమిషాల్లోనే ఎఫ్ఐఆర్, వారంలో వెయ్యి మంది బాధితులకు ఫోన్

**దూసుకెళ్తున్న సైబర్ మిత్ర**

**సైబర్ నేరాల కేసుల్లో బాధితులకు త్వరిత న్యాయానికి చర్యలు**

**బాధితులకు త్వరిత న్యాయం కోసం హైదరాబాద్ పోలీసుల వినూత్న కార్యక్రమం**

**పది రోజుల్లో వెయ్యి మంది బాధితులకు సీ-మిత్ర భరోసా**

సైబర్ నేరాల్లో చిక్కుకున్న బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు హైదరాబాద్ పోలీసులు చేపట్టిన వినూత్న కార్యక్రమం 'సీ-మిత్ర' (సైబర్ మిత్ర) సత్ఫలితాలను ఇస్తోంది. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఈ విధానం అమల్లోకి వచ్చిన కేవలం పది రోజుల్లోనే వందల మందికి భరోసానిచ్చింది. ఈ స్వల్ప వ్యవధిలో సీ-మిత్ర బృందం 1000 మంది బాధితులకు స్వయంగా ఫోన్ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంది.రోజుకు సగటున 100 ఫోన్ కాల్స్ చేస్తున్నారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో 200 మందికి పక్కాగా ఫిర్యాదు డ్రాఫ్టులను సిద్ధం చేసి పంపింది. వారి నుంచి సంతకం చేసిన ప్రతులు అందగానే ఎక్కడా జాప్యం లేకుండా 100కి పైగా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. గంటల తరబడి స్టేషన్లలో పనిలేకుండా, నిమిషాల్లోనే వర్చువల్‌గా పోలీసులు స్పందిస్తుండటం, ఎఫ్ఐఆర్ కాపీలు నేరుగా మొబైల్‌కే వస్తుండటంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మొబైల్‌కు ఎఫ్ఐఆర్ కాపీ : సైబర్ నేర బాధితులు 1930 నంబరుకు, జాతీయ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సరిపోతుంది. ఆ వెంటనే 'సీ-మిత్ర' బృందం రంగంలోకి దిగుతుంది. బాధితులకు ఫోన్ చేసి పూర్తి వివరాలు ఆరా తీసి, ఏఐ టెక్నాలజీతో లీగల్ అంశాలతో కూడిన పక్కా ఫిర్యాదు డ్రాఫ్టును సిద్ధం చేసి వాట్సాప్ లేదా మెయిల్‌కు పంపిస్తారు. బాధితులు ఆ ఫిర్యాదును ప్రింట్ తీసుకొని, సంతకం చేసి బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ స్టేషన్‌కు కొరియర్ లేదా పోస్ట్ ద్వారా పంపాలి. ఆ కాపీ అందగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ వివరాలను బాధితుల మొబైల్‌కే మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. సీ-మిత్ర సేవలను వేగంగా బాధితులకు అందించేందుకు 24 మందితో కూడిన ప్రత్యేక బృందాన్ని సైబర్ క్రైం విభాగం ఏర్పాటు చేసింది. రెండు షిఫ్టుల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ 'వర్చువల్ హెల్ప్‌డెస్క్' బాధితులకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సైబర్ నేర బాధితులకు ఇబ్బందులు కలగకుండా సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో వినూత్న కార్యక్రమం సీ-మిత్రను జనవరి 9 వ తేదీన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రారంభించారు. "సాధారణంగా మోసపోయామన్న బాధలో ఉన్నవారు పోలీస్ స్టేషన్‌కు రావాలంటేనే భయపడతారు. కానీ, మేమే స్వయంగా ఫోన్ చేసి 'భయపడకండి, మీకు న్యాయం చేయడానికి మేమున్నాం' అని చెప్పగానే వారి గొంతులో కనిపించే ధైర్యం వెలకట్టలేనిది. ఒకప్పుడు స్టేషన్‌కు రావాలంటే ఆలోచించే సామాన్యుడికి, పోలీసులకు మధ్య 'సీ-మిత్ర' ఒక బలమైన వారధిలా నిలిచింది. నేను ప్రతి రోజు 20 మంది బాధితులకు ఫోన్ చేస్తా. ఒక సోదరిలా వారి సమస్యను విని, ఇంటి నుంచే ఫిర్యాదు తీసుకుంటున్నప్పుడు బాధితులు చూపిస్తున్న కృతజ్ఞత మా బాధ్యతను మరింత పెంచుతోంది.టెక్నాలజీని, మానవతా దృక్పథాన్ని జోడించి హైదరాబాద్ పోలీస్ సృష్టిస్తున్న ఈ డిజిటల్ విప్లవంలో ప్రజలకు ఇంత వేగంగా సేవలందిస్తున్నందుకు తమకు చాలా గర్వంగా ఉందని మహిళా కానిస్టేబుల్ పృథ్వీక తెలిపారు. గతంలో సైబర్ మోసం జరిగితే ఫిర్యాదు ఎలా రాయాలి? ఏ సెక్షన్లు వర్తిస్తాయి? అని తెలియక బాధితులు సతమతమయ్యేవారని చెప్పారు. కానీ సీ-మిత్రతో ఆ ఇబ్బందులు ఇప్పుడు లేవని పేర్కొన్నారు. బాధితుల నుంచి మంచి స్పందన వస్తోందని, ఫోన్ చేసి వివరాలు అడగానే సానుకూలంగా స్పందించి అన్ని వివరాలు తెలియజేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో హైదరాబాద్‌లో ఒక్క సైబర్ బాధితుడు కూడా లేకుండా చేసి సీ-మిత్ర బంద్ అయ్యే విధంగా తామంతా పనిచేస్తున్నామని తెలిపారు.




## యువత సవాళ్లు ఎదుర్కోవాలి - ఇబ్బందులను అధిగమించాలి

**సీఎం చంద్రబాబు**

యువత సవాళ్లను ఎదుర్కోవడం ఇబ్బందులను అధిగమించటాన్ని నేర్చుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వివిధ సంస్థలతో మొత్తం 22 లక్షల కోట్ల పెట్టుబడులపై కసరత్తు చేస్తున్నామని ఇది సాకారమైతే 20 లక్షల ఉద్యోగాలు కల్పించగలమని వెల్లడించారు. జ్యూరిక్‌లోని తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగించారు.విజన్ 2020, ఐటీ గురించి తాను మాట్లాడిన రోజుల్లో అందరూ విమర్శించారని, కానీ నేను ఆనాడు తీసుకున్న నిర్ణయం వల్ల 195 దేశాలకు తెలుగు వారు వెళ్లడానికి అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. 2047కు భారత దేశం ప్రపంచంలో నెంబర్ 1 ఎకానమీ దేశంగా అవతరిస్తుందని చెప్పారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారిని, యువకులను పార్టీలో, ప్రభుత్వంలో ప్రోత్సహిస్తున్నామని, అందుకే లోకేశ్, రామ్మోహన్నాయుడు, టీజీ భరత్ వంటి వారికి పదవులు దక్కాయన్నారు. పదవులు వస్తే గ్లామరే కాదు రాళ్లు కూడా పడతాయన్న సీఎం వీటిని ఎదుర్కోవడం యువత అలవరుచుకోవాలని సూచించారు.కోరిన వెంటనే తరలివచ్చారు: ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితం చూపే కమ్యూనిటీగా తెలుగు వాళ్లు ఎదగాలని ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నార్టీలు అద్భుతమైన పని చేశారన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని




పవన్ కల్యాణ్ సహకరించడం సహా బీజేపీ కూడా కలిసి వచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి పూర్వవైభవం తెచ్చేందుకు సహకరించమని ఎన్నార్టీలను కోరితే ఆలోచన చేయకుండా తరలివచ్చి కూటమి కోసం పని చేశారని ప్రశంసించారు. రాష్ట్రంలోని నేతలు, కార్యకర్తలతో సమానంగా కొందరు ఎన్నార్టీలు కూడా కేసులు పెట్టించుకున్నారని గుర్తు చేశారు.పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే: ప్రజల ఆశీస్సులు, ఎన్ఆర్టీల సహకారంతో 93 శాతం స్ట్రైక్ రేట్ తో అద్భుత విజయం సాధించామన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి పునర్ నిర్మించడం సాధ్యమా? అని అందరూ ఆందోళన చెందారని, కానీ 18 నెలల కాలంలో బ్రాండ్ పునరుద్ధరించి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో మంత్రులు, తాను పోటీ పడి పెద్ద ఎత్తున పెట్టుబడులు సాధించామని దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని వివరించారు. తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తి చేసేలా పరిశ్రమలు స్థాపిస్తున్నామన్న చంద్రబాబు, తక్కువ ఖర్చుతో విద్యుత్ కొనుగోళ్లు చేపడుతున్నామని తెలిపారు.విద్యుత్ విషయంలో సంస్కరణలు చేపట్టడం వల్ల డేటా సెంటర్లు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చి విదేశాల్లో స్థిరపడ్డారు మీ ఊళ్లలో ఉన్న వారిని అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా చేసి అభివృద్ధి చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.అభివృద్ధి-సంక్షేమం జోడెద్దుల బండి: చంద్రబాబు విజన్ సాధనకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు 18 నెలల్లో 23.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయని వెల్లడించారు. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చాయన్నారు. టీం 11 ముఖం చూసి ఎవరైనా రాష్ట్రంలో పెట్టుబడులు పెడతారా అని ఎద్దేవా చేశారు. బ్రాండ్ సీబీఎన్ వల్లే కంపెనీలు ఏపీకి వస్తున్నాయని, అభివృద్ధి అంటే గుర్తుకు వచ్చేది చంద్రబాబు అని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండి అని చెప్పారు.


# వ్యంగ్య చిత్ర కళతో సమాజంలో మార్పు

## కలెక్టర్ పమేల సత్పతి




కరీంనగర్ జిల్లాలోని ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆటానమస్), కరీంనగర్ లో తెలుగు విభాగం మరియు తెలంగాణ కార్టూనిస్టు వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన రెండు రోజుల వ్యంగ్య చిత్ర కళ శిక్షణా కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్టూనిస్టుల చిత్రాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పమేల సత్పతి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, కార్టూనిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ పమేల సత్పతి మాట్లాడుతూ "వేగవంతమైన ఈ సమాజంలో తక్కువ సమయంలోనే ప్రజలపై లోతైన ప్రభావం చూపగల శక్తివంతమైన మాధ్యమం కార్టూన్ అని సమాజంలో ఉన్న రుగ్మతలను ప్రశ్నించడానికి, ప్రజల్లో అవగాహన కల్పించడానికి వ్యంగ్య చిత్రాలు కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు.కార్టూనిస్టుల ప్రతిభను మరింతగా ప్రోత్సహించేందుకు వారి చిత్రాల ప్రదర్శన కోసం శాశ్వత వేదికను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ "పరిసరాలను సూక్ష్మంగా గమనించి, వాటిని తనదైన దృష్టితో వ్యంగ్యంగా వ్యక్తపరిస్తే హాస్యం పుడుతుంది. అదే భావానికి చిత్రరూపం ఇస్తే అది కార్టూన్ అవుతుంది" అని అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఇటువంటి శిక్షణ శిబిరాలు ఎంతో అవసరమని, తెలుగు విభాగం ద్వారా కార్టూన్ కళకు ప్రోత్సాహం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ కార్టూనిస్టు వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి రాజమౌళి మాట్లాడుతూ, "ప్రతి వ్యక్తిలో కొంత వ్యంగ్యం దాగి ఉంటుంది. దానిని గుర్తించి సరైన రీతిలో వ్యక్తపరిస్తే హాస్యం సృష్టించవచ్చు" అని అన్నారు. తాను కూడా ఈ కళాశాల పూర్వ విద్యార్థినేనని, మళ్లీ సొంత ఇంటికి వచ్చిన అనుభూతి కలిగిందని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.తెలంగాణ కార్టూనిస్టు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ,"ప్రతి వ్యక్తిలో అంతర్గతంగా హాస్య చతురత ఉంటుంది. దానికి కొంత శాస్త్రీయ దృష్టి, సమాజ అవగాహన జత చేస్తే అది ఒక ఉత్తమ కార్టూన్‌గా మారుతుంది" అని అన్నారు. కార్టూన్ రంగంలోకి కొత్తతరం రావాల్సిన అవసరం ఉందని, అందుకుగాను విద్యార్థులను ఆశ్రయంగా తీసుకొని మరో తరానికి కార్టూనిస్టులను అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కళాశాల తెలుగు విభాగాధ్యక్షులు డా. బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ, "వ్యంగ్యం అనేది కరీంనగర్ జిల్లాలో శాతవాహనుల కాలం నుంచే సాహిత్యం, సంస్కృతిలో భాగంగా కొనసాగుతోంది" అని తెలిపారు. తెలుగు సాహిత్యంకార్టూన్ కళ మధ్య ఉన్న సంబంధాన్ని విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు.ఈ రెండు రోజుల వ్యంగ్య చిత్ర కళ శిక్షణ కార్యక్రమానికి ఇప్పటి వరకు 50 మంది విద్యార్థులు నమోదు చేసుకోవడం జరిగింది. ఇంకా ఆసక్తిగల విద్యార్థులు తెలుగు విభాగంలో సంప్రదించగలరు. కార్టూన్ డ్రాయింగ్ మౌలికాంశాలు, భావవ్యక్తీకరణ, సమాజ అంశాలపై కార్టూన్ రూపకల్పన వంటి అంశాలపై డెమో సెషన్లు, చిత్ర విశ్లేషణలతో ప్రత్యక్ష శిక్షణను రెండు రోజులపాటు అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ ఆచార్యులు బూర్ల వెంకటేశ్వర్లు, డా. ప్రకాష్, డా. శ్రీనివాస్, మెట్టు వెంకటేశ్వర్లు, మాలతీ దేవి, అశోక్ చైతన్య శంకర్ భోజన్న,పలు జిల్లాల కార్టూనిస్టులు,అధిక సంఖ్యలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.











# కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర విజయానికి "త్రి"మూర్తుల కృషి

**శాంతి భద్రతల్లో 'గాడ్ ఫాదర్' ఏసీపీ ప్రశాంత్ రెడ్డి**

**సిఐ పులి రమేష్ ఎస్సైలు ప్రవీణ్ కుమార్, రాజు**

**మహిళలు చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎస్సై దివ్య**





**భీమదేవరపల్లి జనవరి 19 (కాశిరెడ్డి ఆదిరెడ్డి ప్రత్యేక కథనం ప్రజా మంటలు) :** లక్షలాది మంది భక్తులు తరలివచ్చిన ఉత్తర తెలంగాణకే తలమానికంగా నిలిచిన కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి జాతర శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ముగియడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషించింది. ముందస్తు ప్రణాళికలు, పటిష్ట బందోబస్తు, సమన్వయంతో కూడిన విధుల నిర్వర్తన ద్వారా జాతరను సక్సెస్ చేశారు.

### పక్కా ప్రణాళికలతో సిఐ పులి రమేష్ వ్యూహం

జాతర నిర్వహణకు ముందుగానే రూట్ మ్యాప్‌లు, ట్రాఫిక్ డైవర్షన్లు, అత్యవసర సేవల సమన్వయం, భక్తుల రద్దీ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు పులి రమేష్. గత అనుభవాన్ని ఆసరాగా చేసుకుని, ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రసాద కేంద్రాలు, రద్దీ మార్గాల్లో అదనపు సిబ్బందిని మోహరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం ఫీల్డ్‌లో ఉండి పరిస్థితిని సమీక్షించారు.

### ప్రశాంతతకు మారుపేరు ఎస్సై ప్రవీణ్ కుమార్

గతంలో ముల్కనూరులో విధులు నిర్వహించిన అనుభవంతో, ప్రస్తుతం ఎలుకతుర్తి ఎస్సైగా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ ట్రబుల్ షూటర్‌గా వ్యవహరించారు. రద్దీ సమయంలో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నా, సహనం, ధైర్యంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా తీసుకుని, ఎక్కడా ఉద్రిక్తతలు పెరగకుండా సమర్థంగా కృషి చేశారు. సహనం కోల్పోయిన భక్తులను నియంత్రించడంలో స్వల్ప గాయాలైనా కూడా సహనం కోల్పోకుండా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత.

### క్రమశిక్షణకు మారుపేరు ఎస్సై రాజు

ఇటీవలే ముల్కనూరుకు కొత్తగా వచ్చిన రాజు తన టీమ్‌తో కలిసి విధులను నిబద్ధతతో నిర్వహించారు. పహారా, క్యూలైన్ నియంత్రణ, రాత్రి బందోబస్తు వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారు.

### 'గాడ్ ఫాదర్' ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

మొత్తం బందోబస్తుకు నాయకత్వం వహించిన పింగిలి ప్రశాంత్ రెడ్డి పక్కా ప్రణాళికలతో, సిబ్బందిని విభాగాల వారీగా విభజించి విధులు కేటాయించారు. రియల్‌టైమ్ మానిటరింగ్, సీనియర్ అధికారులతో సమన్వయం, అత్యవసర పరిస్థితులపై ముందస్తు సిద్ధతతో జాతర విజయానికి కీలక పాత్ర పోషించారు.

### మహిళా ఎస్సై దివ్య సేవలు

భక్తుల్లో మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపిన వంగర ఎస్ఐ దివ్య మహిళా బృందంతో కలిసి క్యూలైన్‌లు, ఆలయ ప్రాంగణం, ప్రసాద కేంద్రాల వద్ద సేవలందించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేపట్టారు. మొత్తంగా, ముందస్తు ప్రణాళికలు, సమన్వయం, అంకితభావంతో పనిచేసిన పోలీసు బృందం వల్ల కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర శాంతియుతంగా, భక్తుల ప్రశంసల మధ్య విజయవంతమైంది. భక్తులు పోలీసు శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏ పార్టీ తెలవని ఎమ్మెల్యే బి ఫామ్ ఎలా ఇస్తారు

**పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదు**

**యావర్ రోడ్డు విస్తరణ జాప్యానికి ఎమ్మెల్యే నే కారణం**

**మాజీ మంత్రి టీ జీవన్ రెడ్డి**



**జగిత్యాల జనవరి 19 (ప్రజా మంటలు) :** తాను ఏ పార్టీ తెలవని ఎమ్మెల్యే బి ఫాం ఇవ్వడానికి ఎమ్మెల్యే ఎవరు అన్నారు. మాజీమంత్రి జీవన్ రెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మిత్రుల కలయిక సమావేశం అనంతరం మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలు ,నైతిక విలువల గురించి ఏ పార్టీలో ఉన్నాడు తెలియని వ్యక్తి మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2014లో ముఖ్యమంత్రి కేసీఆర్ ను జగిత్యాల ఎమ్మెల్యే గా తాను బోర్నపల్లి వంతెన కోసం కేసీఆర్ కు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసా రని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో నీ జోక్యం ఏమిటి అని ఎమ్మెల్యేను నిలదీశారు. టిడిపి శాసనసభ రద్దు చేసిన తర్వాత తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. 1984లో పార్లమెంట్ ఎన్నికలు జరగగా శుక్రవారం ఆధ్వర్యంలో 1984 డిసెంబర్ లో కాంగ్రెస్లో తాను చేరానని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే మా హక్కులకు అడ్డం పడుతున్నారని మా హక్కుల కోసమే మేము మాట్లాడుతున్నాం అన్నారు.కూకట్పల్లి కేవలం జగిత్యాలలో మాత్రమే జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15 కోట్లకు సింగిల్ టెండర్ మూడు శాతం అధికం అగ్రిమెంటు లేకుండా పనులు ఇదేనా మీ అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించడం ఎమ్మెల్యేగా మీ బాధ్యత కాదా? అని సూటిగా ప్రశ్నించారు.పదేళ్ల నుండి ఎవరు కాంగ్రెస్ పార్టీ జెండా మోసారు వారికి గుర్తింపు ఇవ్వాలని మా విజ్ఞప్తి టికెట్ల గురించి మా అధిష్టానం చూసుకుంటుంది మా పార్టీ గురించి టిక్కెట్ల గురించి మాట్లాడానికి నువ్వు ఎవరు? పదేళ్లు కష్టపడ్డవారు అనుభవించాలా అవకాశవాదులు అనుభవించాలా? అని ప్రశ్నించారు. చొక్కా రావుకు జగిత్యాల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా తాను పనిచేశానని అన్నారు. యావర్ రోడ్డు విస్తరించాలని తాను కలెక్టర్కు లేఖ రాస్తే ఎమ్మెల్యే అడ్డుపడడంతో విస్తరణ జాప్యం కావడానికి ఎమ్మెల్యే నే కారణమని అన్నారు.

# అణగారిన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం

**ఎమ్మెల్యే పూల్ సింగ్ వ్యాఖ్యలపై బీజేపీ నేత ఎం. రాజేశ్వరి ఆగ్రహం**



**సికింద్రాబాద్, జనవరి 19 ( ప్రజామంటలు) :** బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచే వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ఆరోపించారు. ఆమె సోమవారం మీడియాతో మాట్లాడుతూ... మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే పూల్ సింగ్ బరయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు యావత్ మహిళా సమాజాన్ని అవమానించే విధంగా ఉన్నాయని అన్నారు. మహిళలను దేవతలుగా పూజించే భారతదేశంలో ఇటువంటి వ్యాఖ్యలు సిగ్గుచేటని పేర్కొన్నారు. అత్యాచార ఘటనల్లో మహిళలకూ తప్పిదం ఉందన్న తరహా వ్యాఖ్యలు కోట్లాది మహిళల మనోభావాలను గాయ పరిచాయని విమర్శించారు.నటి అనసూయ వ్యాఖ్యల విషయంలో స్పందించిన మహిళా సంఘాలు, కమిషన్లు, దళిత సంఘాలు ఈ అంశంపై మౌనం వహించడం అన్యాయమని అన్నారు. వేముల రోహిత్ ఘటనపై స్పందించిన కాంగ్రెస్ నాయకత్వం, సొంత పార్టీ ఎమ్మెల్యే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.ఎమ్మెల్యే పూల్ సింగ్‌ను వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి, శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, సత్వర విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎస్ జి ఎఫ్ 69 వ జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన త్రిష



**గొల్లపల్లి జనవరి 19 ప్రజా మంటలు :** ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలు ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న జైనపురం త్రిష జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు రాష్ట్రస్థాయి పోటీలు నారాయణపేట జిల్లాలో కోస్గి గ్రామంలో 7 నుండి 9 వరకు నవంబర్ నెలలో జరిగిన పోటీలలో ప్రతిభను కనబరిచి త్రిష జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు జాతీయ స్థాయి పోటీలు గుజరాత్ రాష్ట్రంలోని సోమనాథ్ లో ఈనెల 19 నుండి 23 వరకు జరిగే 69 వ ఎస్ జి ఎఫ్ అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలకు తెలంగాణ జట్టు తరఫున పాల్గొంటుందని తెలిపారు ఈ సందర్భంగా త్రిషను ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్ వ్యాయామ ఉపాధ్యాయులు బైకాని కొమురయ్య మేకల సంజీవ్ రావు ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

# యూత్ కాంగ్రెస్ కప్ ఫైనల్‌లో ముల్కనూర్ సీనియర్స్ విజయం

**యువతలో క్రీడా ఉత్సాహం , ముఖ్యఅతిథిగా పెద్ది వెంకటనారాయణ గౌడ్**



**భీమదేవరపల్లి జనవరి 19 (ప్రజా మంటలు) :** మండలంలోని ముల్కనూరులో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహించిన యూత్ కాంగ్రెస్ మండల మెగా క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో ముల్కనూర్ సీనియర్ క్రికెట్ టీమ్ విజేతగా నిలవగా, ముల్కనూర్ జూనియర్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ ఫైనల్ మ్యాచ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట్ నారాయణ గౌడ్, ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి హాజరయ్యారు. విన్నర్ టీంకు కప్, రన్నర్ టీంకు షీల్డ్‌లను పెద్ది వసంత ట్రస్ట్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట్ నారాయణ గౌడ్ అందజేశారు. విన్నర్ టీంకు ప్రైజ్ మనీని ముత్యం అశోక్ యాదవ్, రన్నర్ టీంకు ప్రైజ్ మనీని శ్రీరాంమోజు చంద్రశేఖర్ గుప్తా అందజేశారు. ఈ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో భీమదేవరపల్లి మండలం నుంచి మొత్తం 26 జట్లు పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాయి. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్





**జగిత్యాల జనవరి 19 (ప్రజా మంటలు) :** పట్టణ మోతే రోడ్డు పార్టీ కార్యాలయంలో జగిత్యాల పట్టణానికి చెందిన 134 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం ద్వారా మంజూరైన 1 కోటి 34 లక్షల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రామ్మోహన్, పట్టణ నాయకులు గిరి నాగభూషణం ,అడువాల జ్యోతి లక్ష్మణ్,గట్టు సతీష్,దామోదర్ రావు,,క్యాదసు నాగయ్యా,బాలే శంకర్,తాజా మాజీ కౌన్సిలర్ లు,పట్టణ నాయకులు,యూత్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి తో పాటు సంక్షేమం పథకాలు అమలు అవుతున్నాయి. పట్టణంలో త్వరలో 50పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం కానుంది. రాష్ట్ర సర్కార్ విద్య వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించింది.5 కోట్ల తో మహిళ డిగ్రీ కళాశాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.జిల్లా కేంద్రంలో అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ మంజూరు తో వృత్తి విద్యా విద్యార్థులకు చాలా ఉపయోగం పట్టణంలో నీటి కొరతకు నూతన ట్యాంక్ ల నిర్మాణం చేపట్టడం జరిగింది.ముఖ్యమంత్రి చొరవతో జగిత్యాలకు 62.5 కోట్ల నిధులు మంజూరు కాగా మౌలిక సదుపాయాలు కల్పన కి కృషి చేస్తాం...వచ్చే నెల నుండి పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు.

# వీరభద్ర భద్రకాళి దేవికి ఘన అభిషేకాలు

**బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి ఓఎస్డీ కుటుంబ సభ్యులు**



**భీమదేవరపల్లి, జనవరి 18 (ప్రజా మంటలు) :** శ్రీ వీరభద్ర స్వామి సమేత భద్రకాళి దేవి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మంత్రి ఓఎస్ డి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కోడె మొక్కు చెల్లించి, గుమ్మడికాయ, కోరమీసంను స్వామివారికి సమర్పించారు. అనంతరం అభిషేకం, కుంకుమార్చన వంటి విశేష పూజాకార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం దేవస్థానం తరఫున అతిథులకు శేష వస్త్రంతో సన్మానం చేసి, ఘనంగా వేద ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం ఈఓ కిషన్ రావు, ప్రధాన అర్చకులు మోగిలిపాలెం రాంబాబు, అర్చకులు తాటికొండ రమేష్, జానకిపురం రవి శర్మ, మోగిలిపాలెం శివకుమార్ తదితరులు వేదోక్త ఆశీర్వాదాలు అందజేశారు.

# గోసంగి కుల సంక్షేమ సంఘానికి కొత్త నాయకత్వం

**భీమదేవరపల్లిలో గోసంగి సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**



**భీమదేవరపల్లి, జనవరి 19 (ప్రజా మంటలు) :** భీమదేవరపల్లి గ్రామంలో గోసంగి కుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో గ్రామస్థులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ గౌరవ అధ్యక్షులుగా బొల్లంపల్లి కుమారస్వామి, గ్రామ గోసంగి కుల సంక్షేమ సంఘ అధ్యక్షులుగా బొల్లంపల్లి రవి మేస్త్రిని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బొల్లంపల్లి శ్యామ్ గారు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొల్లంపల్లి మనోహర్, రాజకిషన్, ఇటికాల సదానందం, బొల్లంపల్లి రవి (ఆటో) లను ఎంపిక చేశారు. సహకార దర్శులుగా సోరుపాక అనిల్ కుమార్, బొల్లంపల్లి మొగిలి, బొల్లంపల్లి సదానందం, గొర్రె రవీందర్ లు నియమితులయ్యారు. కోశాధికారులుగా బొల్లంపల్లి రాజుకుమార్, బొల్లంపల్లి నాగరాజు ఎన్నుకోగా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొల్లంపల్లి రాజు, ప్రచార కార్యదర్శిగా ధైదల ఐలయ్య బాధ్యతలు స్వీకరించారు. సంఘ గౌరవ సలహాదారులుగా బొల్లంపల్లి కుమారస్వామి, బొల్లంపల్లి పెద్ద ఓదెలు, బొల్లంపల్లి నారాయణ, బొల్లంపల్లి రాజయ్య (మిల్లు) నియమించారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గోసంగి కుల సంక్షేమ సంఘం కన్వీనర్ చుంచు మల్లయ్య, హనుమకొండ జిల్లా నాయకులు చుంచు వెంకటేష్ హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

# ముల్కనూర్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర వేలం

**రూ.6.18 లక్షల ఆదాయం - ఈఓ కిషన్ రావు**



**భీమదేవరపల్లి జనవరి 19 (ప్రజా మంటలు) :** ముల్కనూర్ లో నిర్వహిస్తున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా సోమవారం జరిగిన వివిధ వేలాలు విజయవంతంగా పూర్తయ్యాయి. భక్తుల విరాళాలు, వేలాల ద్వారా మొత్తం రూ.6, 18,000 ఆదాయం సమకూరింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు గొల్లేన మహేష్ రూ.1,35,000, ప్రత్యేక దర్శనం, టెంకాయ టికెట్ (చిన్న తీర్థం) మాడుగుల క్రాంతి కుమార్ రూ.1,45,000, కోళ్లు అమ్ముకునే హక్కు ఎం.డి. తకిల్ రూ.42,000, అమ్మవారి దగ్గర బంగారం (బెల్లం) అమ్ముకునే హక్కు గొల్లేన మహేష్ రూ.1,25,000,లడ్డు, పులిహోర విక్రయ హక్కు చిట్కూరి నితిన్ రూ.1,71,000 పొందారు. ఈ వేలాల్లో ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు పర్యవేక్షించారు.

# మేడారంలో మీ పిల్లలు తప్పిపోయారా?

**భయపడకండి, ఏఐ వారిని కనిపెడుతుంది**

**భారీగా తరలివచ్చే భక్తులకు రక్షణ కోసం కృత్రిమ మేధ**

**సాంకేతికతతో భద్రతా చర్యలు**

**సీఎం రేవంత్ రెడ్డికి వివరించిన అధికారులు**

**శాంతిభద్రతల పరిరక్షణ కోసం 12 ప్రత్యేక క్రైమ్ బృందాలు**





సాధారణంగా ఏదైనా రద్దీ ప్రదేశాల్లో లేదా జాతరల్లో చిన్న పిల్లలు తప్పిపోయారనే వార్తలు మనం చూస్తూనే ఉంటాం. అందుకే ఈసారి మేడారం జాతరలో పోలీసులు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత సాయంతో అనేక అంశాలను వినియోగించి భద్రతా చర్యలు చేపడుతున్నారు. పిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా ఉండేందుకు జియోట్యాగ్‌లను, నిఘా కోసం డ్రోన్లను, తొక్కిసలాట ముప్పును నివారించేందుకు జూమ్ కెమెరాలను వాడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోలీసు అధికారులు వివరించారు. జాతర భద్రత ఏర్పాట్లపై ఆదివారం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, డీజీపీ శివధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 28 నుంచి 31 వరకు భారీగా తరలివచ్చే భక్తులకు రక్షణపరంగా ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని రేవంత్ రెడ్డి పోలీసులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ 450కి పైగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల వ్యవస్థను పరిశీలించారు. ఈ కెమెరాలు హైదరాబాద్‌లోని 'తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్'కు అనుసంధానమై నిరంతరం నిఘా ఉంచుతాయని ములుగు ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కోసం జియోట్యాగ్

**భద్రత చర్యల గురించి అధికారులు ఏం చెప్పారంటే? :** జాతర కోసం 13 వేల మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నారు. మేడారం 2.0లో భాగంగా ప్రవేశపెట్టిన అత్యాధునిక 'టీజీ-క్వెస్ట్' అనే ఏఐ ఆధారిత డ్రోన్ వ్యవస్థ 30 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన దట్టమైన అటవీ ప్రాంతం, రహదారులు, జంపన్నవాగు ప్రాంతాల్లో భద్రతను పర్యవేక్షిస్తుంది. తొక్కిసలాట ముప్పును నివారించేందుకు డ్రోన్లతోపాటు హీలియం బెలూన్లకు అమర్చిన పాన్-టిల్ట్-జూమ్ (పీటీజెడ్) కెమెరాలను వాడుతున్నాం. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 12 ప్రత్యేక క్రైమ్ బృందాలు నియమించాం. పార్కింగ్ తదితర ప్రాంతాల్లో బైక్ పెట్రోలింగ్ యూనిట్లను ప్రవేశపెట్టాం. ముఖ గుర్తింపు సాంకేతికతను ఉపయోగించి పాత నేరస్థులను గుర్తిస్తాం. అనుమానాస్పద వస్తువులను పసిగట్టి రియల్-టైమ్ హెచ్చరికలు పంపిస్తాం. 2,000 ఎకరాల విస్తీర్ణంలో 37 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశాం. భక్తులకు మార్గనిర్దేశం చేయడానికి 50కి పైగా అనౌన్స్‌మెంట్ పాయింట్లను ఏర్పాటు చేశాం.

**పిల్లలు, వృద్ధులకు జియోట్యాగింగ్ :** జాతరలో క్రితంసారి 30 వేల మంది వరకు తప్పిపోయిన నేపథ్యంలో ఈసారి వొడాఫోన్-ఐడియాతో కలిసి 'జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' వ్యవస్థను సిద్ధం చేశారు. భక్తులు గద్దెలకు చేరుకునే పస్రా, తాడ్వాయి మార్గాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో పిల్లలు, వృద్ధుల వివరాలను నమోదు చేసుకొని జియోట్యాగ్‌లు వేస్తారు. వివరాలను తెలుగు, ఆంగ్లం, తమిళం, హిందీ భాషల్లో నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు. ట్యాగ్‌ను ధరించినవారు తప్పిపోతే క్యూఆర్ కోడ్ ఆధారంగా కనిపెడతారు. ఇలాంటి ప్రయోగం శబరిమలలో విజయవంతం కావడంతో మేడారంలోనూ అమలు చేస్తున్నారు.

**పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు :** ఈ నేపథ్యంలో 1600 మందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పేర్కొన్నారు. వివిధ జిల్లాలకు చెందిన ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో శనివారం మేడారంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో సమీక్ష నిర్వహించారు. భద్రత ఏర్పాట్లు, వాహనాల రాకపోకలు, స్టేజ్ యాక్సెస్ కంట్రోల్, భక్తుల నియంత్రణ తదితర ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం భద్రతకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. యాంటీ బాంబ్‌స్క్వాడ్‌తో తనిఖీలు, ట్రబుల్ మేకర్స్‌పై నిఘా, రహదారుల తనిఖీ చేపడుతున్నామన్నారు. సీఎం పర్యటన పూర్తయ్యేవరకు మేడారంలో డ్రోన్లు ఎగురవేయడం పూర్తిగా నిషేధించామని అన్నారు.

# చౌక గృహాల కోసం 10 % స్థలాన్ని కేటాయించాలి : నీతి ఆయోగ్

**పేదల ఇళ్లకు ప్రత్యేక స్థలాలు అవసరం**

**గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో వారికి 10-15% కేటాయించాలి**

**నీతి ఆయోగ్ కమిటీ నివేదిక**

**ఇతర దేశాల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తారంటే?**




"మెట్రో నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్న సుమారు 85 శాతం మంది 30 చ.మీ. విస్తీర్ణంలో ఉన్న గృహాలను కూడా కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. భూముల ధరలు, నిర్మాణ వ్యయం ఏటికేడు పెరుగుతుండటమే ఇందుకు కారణం" అంటూ నీతి ఆయోగ్ పేర్కొంది. ఈ సమస్య పరిష్కారానికి నీతి ఆయోగ్, కేంద్ర పట్టణ వ్యవహారాలు, ఆర్థిక సేవల విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. పట్టణాలు, నగరాలు, ప్రత్యేక జోన్లు, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల మాస్టర్ ప్లాన్లతో పాటు ల్యాండ్ పూలింగ్ పథకాల్లోనూ చౌక గృహాల కోసం 10 శాతం స్థలాన్ని కేటాయించాలని సూచన చేసింది. పేదలు (ఈడబ్ల్యూఎస్), అల్ప ఆదాయవర్గాలకు (ఎల్ఐజీ) చౌక గృహాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపింది.

**స్థిర ఆదాయం లేదు :** దేశంలో ఇప్పుడు 50 కోట్ల మంది వరకు నగరాలు, పట్టణాల్లో జీవనం సాగిస్తున్నారు. 2050 నాటికి సుమారు 85 కోట్లకు చేరతారని అంచనా. ఇక్కడ గృహాల మార్కెట్ మధ్య తరగతి, ఉన్నత వర్గాలకే పరిమితం అయింది. పేదలకు (అసంఘటిత కార్మికులు, స్వయం ఉపాధి పొందేవారికి) గృహాలు అందుబాటులో లేవు. వీరికి స్థిర ఆదాయం లేదు. దీంతో రుణాలూ అందడం లేదు. గత ఐదు సంవత్సరాల్లో చౌక ఇళ్ల వాటా 40 శాతం నుంచి 16 శాతానికి పడిపోగా అల్ట్రా లగ్జరీ గృహాల వాటా 4 శాతం నుంచి 16 శాతానికి పెరిగింది. ఇదే టైంలో పట్టణాల్లో 5-7 కోట్ల గృహాల కొరత నెలకొంది.

**ఏ సవాళ్లు ఉన్నాయంటే? :** పట్టణాల్లో ల్యాండ్ పూలింగ్, మౌలిక సదుపాయాల కల్పన పెద్ద సమస్యగా ఉంది. గృహ ప్రాజెక్టు వ్యయంలో భూ సమీకరణకే 70 శాతం వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దాంతో నిర్మాణ వ్యయం ప్రతి సంవత్సరం పెరుగుతోంది. సరైన ప్రణాళిక కొరవడి మురికివాడలు, అనుమతిలేని కాలనీలు వెలుస్తున్నాయి. ఈడబ్ల్యూఎస్స, ఎల్ఐజీ గృహాల్లో లాభం తక్కువగా ఉంటోందని వ్యాపారస్థులు పెద్దగా ముందుకు రావడం లేదు.

**ఇతర దేశాల్లో ఇలా :** ఆస్ట్రియా రాజధాని వియన్నాలో 3 మిలియన్ చ.మీ. భూమిని చౌక గృహాలకు కేటాయిస్తున్నారు. నగర జనాభాలో సుమారు 50 శాతం మంది ఈ గృహాల్లోనే ఉంటున్నారు. సింగపూర్‌లోనూ 80 శాతం మంది హౌసింగ్ బోర్డు ఫ్లాట్లలోనే జీవనం సాగిస్తున్నారు. దక్షిణ కొరియాలో 10 నుంచి 30 ఏళ్ల లీజు లేదా శాశ్వత అద్దె ప్రాతిపదికన ఇళ్లు అందిస్తున్నారు. స్టూడెంట్స్, యువతకు మార్కెట్ ధరలో 60 నుంచి 80 శాతానికి ఇస్తున్నారు.

**సూచనలు ఇవే :** చౌకగృహాల కోసం భూముల లభ్యత పెంచాలి. పీపీపీ, ప్రత్యేక నిధి ద్వారా నిధులు అందుబాటులోకి తీసుకురావాలి. భవన నిర్మాణ నిబంధనలను సవరించాలి. భూముల సమీకరణ, ప్రణాళికల అభివృద్ధికి పట్టణ ప్రాంత పరిధిని విస్తరించాలి. అనంతరం ప్రత్యేక చౌకగృహాల జోన్లు ఏర్పాటు చేయాలి. ల్యాండ్ బ్యాంకులు ఏర్పాటు చేయాలి. పారిశ్రామిక ప్రాంతాలకు దగ్గర్లో కార్మికులకు అద్దె గృహాలను కట్టించాలి. ప్లాటు విస్తీర్ణం 10 వేల చ.మీ.కు మించిన నిర్మిత ప్రాంతం ఉన్న ప్రాజెక్టుల్లో 10 నుంచి 15 శాతం ఎంఐజీ, ఎల్ఐజీ వర్గాలకు తప్పనిసరిగా కేటాయించాలి. ఈ వర్గాలకు అక్కడే ఇళ్లు కేటాయించే అవకాశాలు లేకుంటే 4 కి.మీ. దూరంలో అన్ని వసతులతో కట్టించాలి. అదీ సాధ్యం కాకుంటే నిర్మాణ వ్యయంలో రెండింతలు షెల్టర్‌ఫండ్‌కు జమ చేయాలి. సిటీల్లో స్టూడెంట్స్, వర్కర్ల కోసం ప్రైవేటుగా ఏర్పాటు అయ్యే పీజీ (పెయింగ్ గెస్ట్), సర్వీసు అపార్టుమెంట్లకు తాగు నీరు, విద్యుత్తు కనెక్షన్లను నివాస కేటగిరీలో చేర్చాలి. 60 చ.మీ. విస్తీర్ణానికి లోపున్న గృహాలను పేదలకు రూ.1 నుంచి రూ.1000కే రిజిస్ట్రేషన్ చేయాలి. వాణిజ్య, నివాస గృహాల రిజిస్ట్రేషన్ టైంలో అదనంగా 1.1-3 శాతం ఫీజును వసూలు చేసి చౌకగృహాల ప్రత్యేకనిధికి జమ చేయాలి.

# ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు!

**ఒకట్రెండు రోజుల్లో నోటిఫికేషన్**

**తెలంగాణలో పురపోరుకు సర్వం సిద్ధం**

**రాష్ట్రవ్యాప్తంగా ఒకే విడతలో ఎన్నికలు**

**నిర్వహించే యోచనలో ఎలక్షన్ కమిషన్**

**7 నగరపాలక సంస్థలు, 116 పురపాలికల**

**ఎన్నికల షెడ్యూల్ జారీకి సిద్ధం**




రాష్ట్రంలో పురపోరుకు సర్వం సిద్ధమైంది. 7 నగర పాలక సంస్థలు, 116 పురపాలికల ఎన్నికల షెడ్యూల్ జారీకి ఈసీ సమాయత్తం అవుతోంది. ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలకు సిద్ధమైన ఈసీ, ఈ ఎన్నికలను ఒకే విడతలో నిర్వహించే యోచనలో ఉంది. మున్సిపల్ ఎన్నికలకు మార్గదర్శకాలు జారీ చేసింది.

**రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తవగా :** రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతో మున్సిపల్ పోరుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది. ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన దస్త్రం ఇవాళ ఎన్నికల సంఘానికి చేరనుంది. అందుకు అనుగుణంగా ఈసీ సమావేశమై షెడ్యూల్ విడుదల చేస్తుంది. ఇప్పటికే మహబూబ్‌నగర్, కరీంనగర్, మంచిర్యాల, కొత్తగూడెం, రామగుండం, నల్గొండ, నిజామాబాద్ నగరపాలక సంస్థలతో పాటు 116 పురపాలికల్లో ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధమయ్యాయి. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తవగా, వాటిపై గెజిట్లు జారీ అయ్యాయి.

**ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు! – ఒకట్రెండు రోజుల్లో నోటిఫికేషన్**

నోటిఫికేషన్ విడుదలైన 15 రోజుల్లో : రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు ఒకే దఫాలో ఎన్నికలు జరపాలని ఈసీ భావిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత 15 రోజుల్లో పోలింగ్ జరగనుంది. పోలింగ్ పూర్తైన తర్వాత రెండ్రోజులకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగి ఎన్నికలకు ఆటంకం కలిగితే మరుసటి రోజు రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఆ తర్వాత రోజు అధికారులు ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటిస్తారు. ఆ తర్వాత మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఎన్నికైన కార్పొరేటర్లతో మేయర్, డిప్యూటీ మేయర్, వార్డు కౌన్సిలర్లతో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలు జరిపి ఫలితాలను ప్రకటిస్తారు.

**పోటీ చేసేందుకు ఈ అర్హతలు :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల అర్హతలు, వ్యయ పరిమితి ఇతర అంశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. భారత పౌరులై ఉండి, కనీసం 21 ఏళ్లు నిండి ఉండాలని తెలిపింది. కార్పొరేటర్‌గా పోటీ చేస్తుంటే కార్పొరేషన్ పరిధిలోని ఏదైనా డివిజన్, కౌన్సిలర్‌గా పోటీ చేస్తుంటే ఆ మున్సిపాలిటీ పరిధిలోని ఏదైనా వార్డులో ఓటరై ఉండాలని పేర్కొంది. పోటీ చేసే అభ్యర్థి ఆయా నగర లేదా పురపాలికల్లో కాంట్రాక్టర్‌గా ఉండకూడదు. నగర లేదా పురపాలికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో లాభదాయక పదవులు చేపట్టకూడదని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు నుంచి తొలగించి ఉంటే పోటీకి అనర్హులని ఈసీ తెలిపింది. గతంలో పోటీ చేసి ఎన్నికల వ్యయ వివరాలు సమర్పించనందుకు ఈసీ అనర్హులుగా ప్రకటించిన వారు, ఐపీ పెట్టిన వారు పోటీ చేయరాదని పేర్కొంది. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థికి సంబంధిత పార్టీ నుంచి బీఫామ్ ఉండాలని తెలిపింది. నామినేషన్ల ఉప సంహరణ చివరి తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు రిటర్నింగ్ అధికారికి బీఫాం అందించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. పార్టీ అభ్యర్థిని స్థానిక వార్డు లేదా డివిజన్‌లోని ఒక ఓటరు ప్రతిపాదించాల్సి ఉండగా, ఒక అభ్యర్థికి ప్రతిపాదించిన వ్యక్తి మరో అభ్యర్థికి ప్రతిపాదించరాదని తెలిపింది.

**పది మంది ఓటర్లు ప్రతిపాదించాలి :** స్వతంత్ర అభ్యర్థిని స్థానికంగా పది మంది ఓటర్లు ప్రతిపాదించాలని తెలిపింది. ఒక అభ్యర్థి 4 కంటే ఎక్కువ నామినేషన్లు వేయకూడదని స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీ చేసే ఆయా వర్గాల వారు డిప్యూటీ తహసీల్దార్ హోదాకు తగ్గని అధికారి సమక్షంలో చేసిన డిక్లరేషన్‌ను విధిగా జత చేయాలని మార్గదర్శకాల్లో ఈసీ సూచించింది.

# ఎలక్ట్రిక్ వాహనాలు సరే జాగ్రత్తలు ఏవీ?

**బ్యాటరీ ఛార్జింగ్ మాటేంటి**

**మన్యం జిల్లాలో సుమారు 15 వేల వరకు ఈవీ వాహనాలు తిరుగుతుండగా,**

**వీటిలో ఎక్కువగా ద్విచక్ర వాహనాలే**

**వాహనాల బ్యాటరీలు కాలిపోవడం, విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదాలు**



మన్యం జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ) వినియోగం క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం సుమారు 15 వేల వరకు ఈవీ వాహనాలు తిరుగుతుండగా, వీటిలో ఎక్కువగా ద్విచక్ర వాహనాలే ఉన్నాయి. పర్యావరణహితంతో పాటు పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలతో పోల్చితే వీటి ప్రయాణ ఖర్చు తక్కువగా ఉండడంతో కొనుగోలుకు వినియోగదారులు ఎక్కువ మొగ్గుచూపుతున్నారు. రాబోయే రోజుల్లో వీటి వాడకం మరింత ఎక్కువగా పెరిగే అవకాశం ఉంది. ఈవీ వాహనాల వాడకం మంచి పరిణామమే అయినప్పటికీ కొన్నిచోట్ల వాహనాల బ్యాటరీలు కాలిపోవడం, విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు అత్యధికంగా జరుగుతుండడం కొంచెం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈవీ వాహనాల కొనుగోలు, వాటి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత నిపుణులు కొనుగోలుదారులకు సూచిస్తున్నారు. ఈవీ వాహనాల బ్యాటరీలకు ఛార్జింగ్ నిర్నిత సమయంలోనే పెట్టాలంటున్నారు. రాత్రంతా పెట్టేసి అలా వాహనాన్ని వదిలేయడం చాలా ప్రమాదకరం. ఛార్జింగ్ 20 నుంచి 80 శాతం వరకే ఉండేలా చూస్తే ఈవీ వాహనం ఎక్కువ రోజులు మన్నిక వస్తుంది.

**నిర్వహణ ఇలా :**

దూర ప్రయాణాలు చేసి వచ్చిన వెంటనే వాహనానికి ఛార్జింగ్ పెట్టకూడదు. అప్పటికే బ్యాటరీ చాలా వేడెక్కి ఉండడంతో అది పేలిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంది. వాహనం కడిగిన తర్వాత నీటి తడి మొత్తం పూర్తిగా ఆరిపోయేలా చూసుకోవాలి. వీటికి ఉన్న వాటర్ ప్రూఫ్ అరగంట వరకు మాత్రమే వాహనానికి రక్షణ ఇస్తుంది. అంతకుమించి నీటిలో ఉంటే బ్యాటరీలోకి నీరు చేసే అవకాశముంది. నాసిరకం బ్యాటరీలు ఉన్నా, వైరింగ్‌లో తప్పిదాలు ఉన్నా షార్ట్ సర్క్యూట్ జరిగి అవి పేలుతాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి వాహనాన్ని తప్పకుండా తనిఖీ చేయించాలి. ఆరు నెలలకు ఒకసారి వైరింగ్‌ను, బ్యాటరీ పనితీరును మెరుగుపర్చాలి. ఛార్జింగ్‌కు ప్రత్యేక పాయింట్‌ను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. ప్లగ్ తడవకుండా, శుభ్రంగా ఉండేలా జాగ్రత్తగా చూసుకోవాలి.

**కొనుగోలు సమయంలో ఇవి చూడండి :**

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం, కారు కొనుగోలు చేయాలనుకుంటే ముందు రోజువారీ ప్రయాణ దూరాన్ని ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకోవాలి. తక్కువ దూరమైతే ఏదైనా ఈవీ వాహనం సరిపోతుంది. 400 కి.మీ పైబడి ఎక్కువ దూరం ప్రయాణం చేయాలనుకున్నపుడు ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉన్న ఈవీ వాహనాన్ని ఎంచుకోవాలి. ఈవీ వాహనానికి ఉండే బ్యాటరీనే దాదాపు సగం ధర ఉంటుంది. రేంజ్, లైఫ్, రీప్లేస్‌మెంట్ గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఇంటి వద్ద ఛార్జింగ్ సౌకర్యాలు అన్నీ అనువుగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. లేనిపక్షంలో ఛార్జింగ్ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రమాదాల నుంచి రక్షణ కోసం ఈవీకి "బీమా" తీసుకోవడం మంచిది.

**ఈవీ ప్రమాదాలు :**

సీతంపేట : 2023వ సంవత్సరం డిసెంబర్ 19న ఓ ఈవీ ద్విచక్ర వాహనం నుంచి ఛార్జింగ్ పెట్టిన కొంతసేపటికే మంటలు చెలరేగాయి. అదుపు చేసేందుకు ప్రయత్నించినా మంటలు ఆగలేదు. వాహనమంతా పూర్తిగా కాలి బూడిదైంది. ప్రమాదం జరిగే సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది.

**రాజాం :** 2025 డిసెంబర్ 8న పట్టణంలోని అంతకాపల్లి సమీపంలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఒక్కసారిగా దాని నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను అదుపు చేశారు.ద

# మహిళా పారిశ్రామికవేత్తలకు 'రైజ్'

**బ్రాండింగ్, డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ**

**ఎస్‌హెచ్‌జీ మహిళల అభివృద్ధి, ఆర్థిక పోత్సాహం ఇచ్చేందుకు 'రైజ్'**

**ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా శిక్షణ పొందిన వెయ్యి మంది మహిళలు**

**నిర్వహణకు సహకారం అందించనున్న నీతి ఆయోగ్**

**జిల్లావ్యాప్తంగా రైజ్ సెంటర్ ఏర్పాటుకు యోచన**




మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళల నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడం, ఆర్థికంగా అండగా ఉండటంతోపాటు తయారీ వస్తువుల బ్రాండింగ్, డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లిలో రూరల్ ఇంక్యుబేషన్ స్కిల్లింగ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రాజెక్టును ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటైన 'రైజ్' నిర్వహణకు నీతి అయోగ్ సహకారం అందించనుంది. మహిళలను స్వయం సమృద్ధి సాధించే పారిశ్రామికవేత్తలుగా 'రైజ్' ప్రోత్సహించనుంది. తొలి 'రైజ్' సెంటర్: రాష్ట్రంలో లక్షలాది మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఉన్నారు. వారిని ఆంత్రప్రెన్యూర్లుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. మహిళల్లో వ్యాపార ఆలోచనలు ఉన్నా డిజిటల్ మార్కెటింగ్ చేయడం, లేబుల్ ప్రాసెసింగ్ వంటి అంశాలపై అవగాహన ఉండటం లేదు. వీటన్నింటికి సమాధానంగా రూరల్ ఇంక్యుబేషన్ స్కిల్లింగ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్- రైజ్ ప్రాజెక్టు ద్వారా భరోసా కల్పించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ముందడుగు వేసింది. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో 'రైజ్' సెంటర్‌ను రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు చేశారు. యూనిట్లు స్థాపించి కుటుంబాలకు తోడుగా: మంచి ఆలోచనతో వ్యాపారం చేయాలని ముందుకొచ్చే మహిళలకు కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, కాగితపు బొమ్మలు తయారీ, గానుగ ఎద్దు ద్వారా నూనె ఉత్పత్తి, జూట్ బ్యాగుల తయారీ, బ్యూటీ పార్లర్ వంటి యూనిట్ల స్థాపనకు 'రైజ్' సెంటర్ ప్రోత్సాహం అందిస్తోంది. వ్యాపారానికి రుణాలు పొందేందుకు శిక్షణ, డిజిటల్ మార్కెటింగ్‌పై రైజ్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే వెయ్యి మందికి పైగా మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా శిక్షణ పొందారు. వివిధ యూనిట్లు స్థాపించి తమ కుటుంబాలకు తోడుగా నిలుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రైజ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. స్కిల్లింగ్, మార్కెటింగ్ అనుసంధానానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, అలీప్, వికాశ్ వంటి సంస్థలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్, సోషల్ మీడియా వినియోగం వంటి అంశాలలో పూర్తిస్థాయిలో శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 5వేల మంది మహిళలను ఆంత్రప్రెన్యూర్స్ లక్ష్యంగా: రైజ్ సెంటర్ నిర్వహణకు 1.67 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని నీతి ఆయోగ్‌కు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. రైజ్ సెంటర్ ద్వారా ప్రస్తుతం వెయ్యి మందికి శిక్షణ అందించగా భవిష్యత్తులో జిల్లాలో 5వేల మంది మహిళలను ఆంత్రప్రెన్యూర్స్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అధికారులు అడుగులు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రైజ్ సెంటర్ ఏర్పాటుకు చేయాలని యోచిస్తున్నారు.

**'స్టేట్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం' :** సేవా, తయారీ రంగాల్లో సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతం చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యానికి అనుగుణంగా ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికి 'స్టేట్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం' అమలు చేయాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన అని గతంలోనే తెలిపిన సంగతి తెలిసిందే. ఆ మేరకు రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విధానాలను తయారు చేసింది. వాటిని ఇప్పటికే సీఎం పరిశీలనకు పంపింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com